# గోదారమ్మ-10

'ముద్దుగారే..యశోదా, ముంగిట ముత్యము వీడూ...

దిద్దరాని మహిమల దేవకీ సుతుడూ....

ముద్దుగారే యశోదా....'

కుముద స్వరం శ్రావ్యంగా వినపడుతుంటే...సీతా..గోదారమ్మా, తన్మయత్వంతో అలా నిలబడిపోయారు. తేరుకున్న సీత కుముద ను దగ్గరకు తీసుకుని..."నీ గొంతు లో ఏదో మాధుర్యం వుంది కుముదా...నాలా కాకుండా సంగీతంలో శిక్షణ తీసుకుంటే మరింత బాగా పాడగలవు" అంది ఆనందంగా.

" తమ్ముడిని చూస్తే నాకు బాగా ముద్దు వచ్చి ఈ పాటే వచ్చేస్తుంది పిన్నీ" అంటూనే కుముద..తడబడుతూ ..." అదే..రంగాని చూస్తే.." అంది ఒక క్షణం లో వెంటనే సరిజేసుకుంటూ.

" రంగాని తమ్ముడనే పిలువు కుముదా....అంతే కాదు, నన్ను కూడా చక్కగా 'అమ్మా'అని పిలవచ్చు నువ్వు" అంది సీత కుముదను మరింత దగ్గరకి తీసుకుంటూ.

ఆ మాటలతో కుముద మొహం వికసించటం, తను కూదా సీతను మరింతగా హత్తుకోవటం చూసిన గోదారమ్మ కళ్ళు చెమర్చాయి. ఎంతైనా ఆడపిల్లకి తల్లి ఆలనా పాలనా చాలా అవసరం అనుకుంటూ గోదారమ్మ తృప్తిగా నిట్టూర్చింది.

రామచంద్ర అపుడపుడూ తమ పెరట్లో నాటిన మొక్కలు కాసినవి అంటూ వంకాయలో, బెండకాయలో కాసిని తెచ్చి ఇవ్వటం జరుగుతూంటుంది.

ఆ రోజు అలాగే తెచ్చిన రామచంద్ర గోదారమ్మకు ఇవ్వబోయాడు.

గోదారమ్మ అందుకోకుండా ''నాకెందుకయ్యా ఇవ్వటం... నేనేమైనా వండుతానా... పెడతానా... నువ్వే సీతకు ఇవ్వు... ఏం చేయాలో ఆలోచిస్తుంది...!'' అందావిడ.

''సీతగారికి ఇవ్వటం అంటే... నాక్కొంచెం సంకోచంగా ఉంటుందండీ. ఆమెకు మగవాళ్ళ పట్ల సదభిప్రాయం లేదని... మీరేగా చెప్పారూ...?'' అంటూ అతను నసుగుతూంటే....

‘‘అవును, చెప్పాను...అయితే ఎపుడూ అదే అభిప్రాయం ఉంటుందా... మార్పు రావచ్చు కదా... ఇన్నాళ్ళల్లో... నిన్నూ, నీ ప్రవర్తనా చూసాక అయినా నువ్వెలెంటి వాడివో గ్రహించి వుండదంటావా?’’ అంది గోదావరమ్మ.

‘‘అయితే ఫరవాలేదంటారా...?’’ అంటూ కూరగాయలున్న కవరును తీసుకుని వంటగదిలోకి వెళ్ళాడు రామచంద్ర.

ఆ కూరగాయల సంచీని సీత నిలబడి వున్న చోట... స్టవ్ పక్కన పెడుతూ అతను ఒక క్షణం సీతను పరీక్షగా చూసాడు.

ఆ రోజు సీత... ఎర్రటి చుక్కలున్న పుసుపు రంగు చీర కట్టుకుంది. జడలో... పెరట్లో వున్న ముద్దనంది వర్ధనం మొక్కనుండి తెంపిన రెండు పూలున్న చిన్న గుత్తిని రెండు ఆకులతో సహా పెట్టుకుంది.

రామచంద్ర చిరునవ్వుతో చూస్తూ పరవశంలో అన్నాడు ‘‘సీతా... మీరివ్వాళ ఈ రంగుల మిశ్రమంతో చాలా అందంగా, ఇంద్రధనస్సులా కనిపిస్తున్నారు...!’’ అని, సీత చురుక్కున వెనుదిరిగి చూడటంతో వెంటనే సర్దుకుంటున్నట్లుగా ‘‘మీ స్కూలులో మీతోపాటు పనిచేసే సహోద్యోగిని ఎవరైనా ఇలా పొగిడితే, మీకేం కోపం రాదుగా... అలా అనుకోండీ!’’ అన్నాడు తడబాటును కపిపుచ్చుకుంటూ.

సీత చిరునవ్వుతో చూస్తూ ‘‘నాతో పాటూ పనిచేసే ఆడవాళ్ళ నోటివెంట ఈ  మాట వినటం కంటె... అబ్బాయి నోట వినడమే నాకు ఆనందంగా ఉంది...!’’ అంది నునుసిగ్గుతో.

ఆ మాటతో రామచంద్ర వదనం అమాంతం వెలిగిపోయింది!

‘‘నిజమా... అయితే... నేను అబ్బాయినే కదా! మాగవాళ్ళంటే మీకు మంచి అభిప్రాయం లేదని పెద్దమ్మగారు చెప్పటం తో కొంచెం భయపడ్డాను సుమా...!’’

సీత మళ్ళీ నవ్వింది...‘‘నిజమే... నూటికి తొంభైమంది అలాంటివాళ్ళే ఉంటారనేది నాఅభిప్రాయం. కానీ ఆ మిగతావాళ్ళలో మీరు ఉంటారని ఈ మధ్య నమ్మకంగా అనిపిస్తుంది... నా నమ్మకం నిజమేగా ?’’

సీత వైపు రామం ఆశ్చర్యంగా చూస్తూ ‘‘నిజంగానా... సీతా?’’ అనడిగాడు ఆనందంగా.

సీత చిరునవ్వుతో క్రీగంట చూసింది.

రామచంద్ర తన్మయుడైపోయాడు.

''అయితే... నేను... నేను... రంగాకి మంచి తండ్రి కాగలనని నమ్ముతున్నావా సీతా...?''

రామచంద్ర అడిగిన తీరు సీతకు బాగా నచ్చింది...'తనకు భర్తగా కంటే రంగాకు తండ్రిగా అనుకోవటం' గొప్ప విషయంగా ఆమెకనిపించింది. 'తన నమ్మకం వమ్ము కాదు'...అనుకుంది మనసులో తృప్తిగా.

అతను ఆనందంగా ''అయితే... పెళ్ళి...'' అంటూ ఏదో అనబోతూండగా సీత మధ్యలో అడ్డంపడి ''ఆ విషయాలన్నీ పెద్దవాళ్ళతో... అంటే పెద్దమ్మతో మీరు మాట్లాడటం బావుంటుంది....!'' అంది.

అతను ఆనందంగా అంగీకరించాడు.

ఆ తరువాత రామచంద్ర గోదారమ్మతో ''మీరు అన్నది నిజమేనండీ. సీతలో నాపట్ల బాగా మార్పు వచ్చినట్లుగా కనబడింది. పెళ్ళికి సుముఖంగానూ అనిపించింది. తన అభిప్రాయం తెలుసుకున్నాను కనుక పెళ్ళి లాంటి మిగతా విషయాలు మీతో మాట్లాడదామనీ ...'' అంటూ మాటలు అసంపూర్తిగా ఆపేశాడు.

ఆవిడ చిరునవ్వుతో చూసింది.

''నేను ముందే అనుకున్నానులే. మీ ఇద్దరూ మంచి జోడీ అవుతారని. కొన్నాళ్ళు నీతో పరిచయం పెరిగాక సీత తప్పక అంగీకరిస్తుందనే నమ్మకం నాకు మొదటినుండీ ఉంది. అందుకే... ఈ మాట విన్నపుడు నాకంత ఆశ్చర్యం కలగలేదు...!'' అని ఒక క్షణం తర్వాత ఆవిడ రామచంద్రతో మళ్ళీ అంది ''ముందుగా ఇద్దరు పిల్లల్నీ మీ పెళ్ళికి సమాయత్తం చేయాలి. వాళ్ళ అంగీకారం ముఖ్యం కదా...!''

ఆ మాటలకి రామచంద్ర కూడా అంగీకరిస్తున్నట్లుగా తలవూపుతూ "అవునండీ. అసలు ఈ పెళ్ళి ఉద్దేశ్యం వాళ్ళకోసమే కూడా కదా...!'' అన్నాడు.

''ఆ పని నేను చేస్తాలే...'' అందావిడ.

రంగా, కుముద తన దగ్గర పడుకున్నపుడు కథలు చెప్పటం పూర్తయ్యాక ఆవిడ వాళ్ళని 'ఓ ప్రశ్న అడగనా' అంటూ మొదలు పెట్టింది..''ఇలాగే అపుడపుడూ కాకుండా మనమందరం ఒకేచోట ఇలా ఉంటే బావుంటుందికదా...?'' ఇద్దరూ వెంటనే తలవూపుతూ "అవును... చాలా బావుంటుది...!'' అన్నారు ఆనందంగా.

ఆవిడ ''అయితే కుముద బాబాయ్ రామచంద్రనూ... రంగా తల్లి సీతనూ పెళ్ళి చేసుకోమని అడుగుదాం. అపుడు రంగాకి తల్లితో పాటూ నాన్నా ఉంటాడు. కుముదకి నాన్న లాంటి బాబాయ్....అమ్మ లాంటి పిన్నీ ఉంటారు ! అపుడు అంతా ఒకే ఇంట్లో ఉంటూ, మీరిద్దరు కలిసి చక్కగా చదువుకుంటూ, ఆడుకుంటూ ఉండొచ్చును.."

పిల్లలిద్దరూ బాగా ఉత్సాహపడుతూ ''అలా అయితే మాకు కూడా చాలా బావుంటుంది!'' అన్నారు ముక్త కంఠంతో.

వాళ్ళిద్దరూ కొంత కాలంగా కలిసి మెలిసి ఉంటున్నందువల్ల ఆ ఏర్పాటుకు తేలిగ్గా అంగీకరించారు.

గోదావరమ్మకూడా తేలిగ్గా నిట్టూర్చింది. తన ఆలోచన ఫలించినందుకు ఆవిడకు సంతోషమూ కలిగింది.

ఆ విషయం ఒకరి నుండి ఒకరికి వూరంతా తెలిసింది. అందరూ గోదారమ్మగారు చేస్తున్న పెళ్ళిగానే భావించారు.

రామచంద్ర ఉంటున్నది అద్దె ఇల్లు కాబట్టి, సీతది కొనుక్కున్న స్వంత ఇల్లు కనుక పెళ్ళి తర్వాత సీత రంగాతో రామచంద్ర ఇంటికి వెళ్ళటం కంటె, ఆ ఇల్లు ఖాళీ చేసి రామచంద్రే కుముద, సామానుతో సీత ఇంటికే రావటం బావుంటుందేమో ఆలోచించండి...'' అని గోదారమ్మ వాళ్ళకి చెప్పినప్పుడు వాళ్ళు కూడా ఆ ఏర్పాటే బావుటుందని అంగీకరించారు.

సీత పెళ్ళి చాలా క్లుప్తంగా జరగటం బావుంటుందని అన్నపుడు, రామచంద్రా అదే తన అభిప్రాయమూ అన్నాడు.

గోదారమ్మ సలహాపై సీత తన తల్లిదండ్రులకు తన పెళ్ళి విషయం ఉత్తరం రాసింది.

పెద్దమ్మగా భావించే గోదారమ్మ వల్ల పెళ్ళిచేసుకోకూడదనే తన అభిప్రాయం మారిందనీ, ఆవిడ సలహాపై, తనకూ, ఆవిడకూ నచ్చిన రామచంద్ర వర్మ అనే అతన్ని వివాహం చేసుకోవాలనుకుంటున్నానని తెలియజేసింది. మామూలుగా పెద్దలు కుదిర్చే సంబంధాలలో లాగ అతను కట్నకానుకలు కోరే వ్యక్తి కాదనీ, ఆపైన రంగాను అభిమానించే మనిషిగా గుర్తించినందువలనే పెళ్ళికి అంగీకరించటం జరిగిందనీ వ్యక్తపరిచింది.

రంగాకు తన స్వంత తల్లికాదనీ, అతని తండ్రి ఓ హంతకుడని ఇక్కడివాళ్ళెవరికీ తెలియదు. అలాగే తనని పెళ్ళిచేసుకుంటున్న వ్యక్తికీ కూడా కొన్నాళ్ళ వరకూ తెలియపరచాలనుకోవటం లేదు కాబట్టి వాళ్ళ పెళ్ళి స్వంత వూళ్ళోకాకుండా తను ఉద్యోగం చేస్తున్న వూళ్ళోనే జరుపుకోవాలనుకుంటోంది కాబట్టి... పెద్దమ్మ నిర్ణయించిన ముహూర్తానికి అమ్మా నాన్నలు ఇద్దరూ రావటం బావుంటుందని కోరుతూ సీత ఉత్తరం లో రాసింది..

సీత తల్లిదండ్రులిద్దరూ కూడా తమ సమ్మతిని ఆనందంగా తెలియజేశారు.

వెంటనే వాళ్ళిద్దరూ వచ్చారు. గోదావరమ్మకు తమ కూతురిని ఓ ఇంటిదానిగాచేస్తున్నందుకు మరీమరీ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆవిడ వాళ్ళ అభిప్రాయానికి అభ్యంతరం చెబుతూ ''ఇందులో నాదేముందమ్మా. ఇద్దరికి ఇద్దరూ ఒకేలాంటి స్వభావం, అభిప్రాయాలున్నవాళ్ళు తటస్థపడ్డారు. అందుకే నాకీ ఆలోచన వచ్చింది. అంతా... ఆ భగవదేచ్ఛ...!'' అంది.

కొన్నాళ్లల్లో ముహూర్తం నిర్ణయించి, విషయం తెలియజేస్తే మళ్ళీ వస్తామని చెప్పి వెళ్ళారు. తాము చేయగలిగిన పనులు ఏమైనా ఉంటే తెలియజేయమనీ చెప్పి తిరుగు ప్రయాణమయ్యారు.

అలా అందరికీ సీతా, రామచంద్రవర్మల పెళ్ళి విషయం ఆనందం కలిగించింది.

* * *

ఒక రోజు గోదావరమ్మ చెప్పింది ''సీతా... రేపటినుండీ బ్రహ్మం గారు కాఫీకిరారు. అయినా నలుగురు ఎలాగూ ఉంటారు. ఆయనకు బదులుగా ఓ కొత్తాయన సూర్యచంద్రంగారు వస్తారు. నేను ఈ ఏర్పాటు చేసాను. నీకు ఎలాగూ ఒక వ్యక్తి మార్పే కాబట్టి ముందుగా కాకుండా ఇప్పుడు చెబుతున్నా'' ఆ మాటలకు సీత ''సరేనమ్మా... మీరు చెప్పాక... కాదనటం అంటూ ఏమీ ఉండదనుకోండి. కాకపోతే ఆయన రాకపోవటానికి కారణం తెలుసుకోవచ్చునా...?'' అడిగింది సీత.

''అదెలా చెప్పకుండా ఉంటాను'' అంటూ ఆవిడ విషయం వివరించింది.

'ఆరోజు ఉదయం ఆవిడ గుడినుండి వస్తూ దారిలోనే ఉండే ఆయన ఇంట్లోకి వెళ్ళింది పలుకరిద్దామని. ఆయన భార్య మంచం మీదే ఉంది. ఆ మధ్య ఆవిడకు ఏదో కీళ్ళవాతం లాంటిది వచ్చి పనులేమీ చేయలేకపోతోంది. ఎవరో ఆవిడ మధ్యాహ్నం వచ్చి వంటచేసివెళ్తోంది.

అందుకే ఆయన కాఫీ సీత ఇంట్లో తాగి వస్తున్నారని గోదారమ్మతో ఆవిడ చెప్పింది. ఆవిడకు కాఫీ అలవాటు లేదేమోననుకుంటే... ఆమె ఉందని చెప్పింది. కానీ అనారోగ్యం వలన తను చేయలేకపోతోంది కాబట్టి ఆయనను సీత ఇచ్చే కాఫీ తాగమని చెప్పి తను మానేసానని చెప్పింది. అంతకు మునుపు ఆవిడ ఆరోగ్యంగా ఉన్నప్పుడు ఉదయం తను కాఫీ పెడితే, ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ, పేపరు చూస్తూ తాగే అలవాటు ఉండేదని చెప్పటంతో గోదావరమ్మకు బాధనిపించింది. ఆ తర్వాత గోదారమ్మ ఆయనను కలిసి గట్టిగా మందలించడం జరిగిందట.

'ఆవిడకు ఆరోగ్యం బాగా ఉన్నపుడు సేవలన్నీ చేయించుకుని, అనారోగ్యం కలగగానే, తన స్వార్థం తాను చూసుకోవటం మంచిదేనా... కనీసం ఆవిడకు కాఫీ పెట్టి, ఆవిడతో కలిసి తనూ తాగటం బావుంటుంది కదా' అని అడిగితే... ఆయన నిజమేననీ, తను చేస్తున్నది తప్పేనని అంగీకరించాడట. అప్పటివరకూ ఆ ఆలోచన తనకు రానందుకు సిగ్గు పడుతున్నానని ఒప్పుకుని ఆ మరునాటి నుండి ఆపని చేస్తానని అన్నాడట.

అదీ విషయం' అని చెప్పి చివరగా గోదావరమ్మ సీతతో ''కాఫీ పెట్టటం పెద్దపనేం కాదుగా, కష్టపడి నేర్చుకోవాలని అనుకోవటానికీ...? ఏదోటైముకి వచ్చి వంటచేసే పనికి ఒకావిడ కుదిరింది కాబట్టి సమస్యలేదనుకో. ఆవిడకు ఏదైనా  పనిబడి రాలేకపోయిన రోజున కూడా హోటళ్ళమీద ఆధారపడకుండా ఏవైనా తేలికయినవి చేయటమూ తెలుసుకుంటే మంచిదని సలహా కూడా ఇచ్చాను. అలాగే అన్నట్లు తలవూపారు. అదే ఆనందం...!'' అంది.

''బాగుందమ్మా, మరి... సూర్యచంద్రంగారి విషయం ఏమిటీ...?'' సీత మరో ప్రశ్న వేసింది.

''ఆయన భార్య ఈ మధ్యనే కాలం చేసింది. ఆయన తనే కాఫీ పెట్టుకుని తాగుతున్నాడని తెలుసుకున్నా. మాటలమధ్య 'ఒక్కడినే తాగటమే కష్టమైన విషయం' అని ఆయన అనటంతో నేనే చెప్పాను. 'మా సీత రోజూ ఓ నలుగురికి కాఫీ పెట్టి ఇస్తుంది. అందరూ కలిసి కబుర్లు చెప్పుకుంటూ తాగటం బావుంటుంది. మీరూ రోజూ ఉదయమే ఇక్కడికి వస్తూ ఉండండని' అందుకే నీకీ విషయం చెబుతున్నా. ముందుగా చెప్పేదేం లేదుగా ఏర్పాట్లు చేసుకోవటానికి ఒకరి బదులు.. ఇంకొకరు వస్తారు. అంతేగా...'' అంది గోదావరమ్మ.

సీత నిట్టూర్చింది. ''ఓ నలుగురికి కాఫీ ఇవ్వగలగటం నాకు బావుండేది. అప్పుడప్పుడూ వద్దన్నా వినకుండా ఎవరో ఒకరు పాలపాకెట్ తెచ్చి ఇస్తూండేవారు. ఇపుడేమో... ఖర్చు అంతా... మీరే పెడుతున్నారుగా పెద్దమ్మా...!'' అంది సీత ఆవిడవైపు కొంచెం కినుకగా చూస్తూ.

''అదెంత ఖర్చులే సీతా...'' అందావిడ.

సీత ''అదేంటమ్మా అలా అంటున్నారూ... కాఫీ మాత్రానికయితే ఫరవాలేదు. ఇంట్లో చాలా వాటికి మీరే ఖర్చు చేస్తున్నారుగా. మీ దగ్గరున్నది ఇపుడిలా ఖర్చు చేసేస్తే ఎలా అమ్మా...! మీరే అందరికీ చెబుతూంటారుగా... కొంచెం పొదుపు చేయాలనీ, రేపటి గురించి భరోసాగా ఉండాలంటే... డబ్బనేది ఆసరా ఇస్తుందనీ...!'' అంది సీతకొంచెం నిష్ఠూరంగా.